కథా నిలయం
5276
శ్రీకాకుళం

# సుముహూర్తం

రమేష్‌చంద్ర వాళ్లది రామయ్య పంతులు ఊరిపక్కన్నె ఓ పల్లె. వాళ్లది వ్యవసాయ కుటుంబం. రామయ్య పంతులు కూతురు పాతికేళ్ల రజని రమేష్‌చంద్రకి నచ్చింది. సరె అంటె సరె అనుకున్నారు. రామయ్య పంతులు పంచాంగాన్ని మరిమరి చూసి అనుకూలమైన ముహూర్తాన్ని మార్చి నెలలో తానే నిర్ణయించాడు. ముహూర్తానికి ఒక్క సెకండ్ అటు ఇటు కాకుండా తాళి కట్టిచ్చాడు. ఆ తరువాత విందు, ఆ ఫంక్షనంతా జరిగింది రామయ్య చదువు చెప్పిన ఊరి బడి ఆవరణలోనే.

అప్పటివరకు తీసిన వీడియో ఫిల్మ్‌ను అక్కడే టి.వి.లో వేసి చూపిస్తున్నారు. తాము సినిమాలో కనిపించినట్టుగ పల్లెజనం తమను తాము అందులో చూసుకొని మరిసిపోతున్నరు. పెళ్లికొచ్చిన బంధుమిత్రులంతా వెళ్లిపోయినంక అదె సాయంత్రం కొత్త దంపతులను రజని వాళ్ల తల్లిగారు తమ ఇంటికి తీసుకెళ్లింద్రు. తల్లి–తండ్రి అదపు ఆజ్ఞలలో పెరిగిన రజని తెలుగులో పి.జి. చేసింది. ఆ నిండైన విగ్రహం పెదాల మీద నవ్వులు, కళ్లలో కాంతి ఆమె వయసుతో పాటె కుదురుకున్నయి. అందుకే రమేష్ ఆమెను చూడగానె ఎన్నుకున్నడు. అన్నిటికి తానె సరిజోదు అన్నంత ధీమా, ఆ ధీమాకు తగ్గ చదువు, సాఫ్ట్‌వేరు ఇంజనీరు కాబట్టేమో సాఫ్ట్ మనస్తత్వం రమేష్‌ది. రజని చలాకితనం ఆయన్ను బాగ ఆకట్టుకుంది. ఆమె చదివిన ప్రబంధ సాహిత్యమంతా ఆమె బుర్రలో ఫ్లాపీలుగ రికార్డు అయివున్నయి. ఇక కావల్సింది మౌస్‌ను కదిలించడమే. ఆ సమయం ఆసన్నమైంది.

తండ్రి రామయ్య పంతులు నలభై ఏండ్లు పంతులు పనిచేసి ప్రధానోపాధ్యాయునిగా పదవీ విరమణ చేసి ఆ ఒక్క కూతురు పెళ్ళి చేసిండు. సర్వీసులో వున్నపుడె కొడుకు పెళ్లి చేసిండు. సాంప్రదాయాన్ని పాటిస్తూ ఆచార వ్యవహారాల్లో గిరిగీసుకొని వుంటూ పంచాంగం చూడంది ప్రయాణం కట్టేదేలేదు. ఆయనతో కలిసి బ్రతుకుతూ వచ్చిన ఆయన భార్య జానకమ్మా అంతే. అయస్కాంతం పక్కనవున్న ఇనుప ముక్కకు అయస్కాంతపు లక్షణాలు అబ్బుతాయి కదా.

అత్తగారిల్లు చేరిన నవదంపతులు వీలున్నప్పుడల్లా చూపులు కలుపుకోవడం,

గోడకున్న అద్దంలో ఒకర్ని కాదని ఒకరు ఎన్నిసార్లు చూసుకున్నరో. రామన్న పంతులు పంచాంగాన్ని విప్పి అందులోని వివరాలు భార్య చెవిలో వేసి జాగ్రత్త అని ఎచ్చరించిండు.

ఆ విషయాన్ని తాను చెప్పలేక కోడలి చెవిలో వేసి చూపుడు వేలును చూపించింది.

సాయంత్రం అయ్యింది. రాత్రి పడింది. కొత్త దంపతులకు ఒకే కంచంలో భోజనాలు చేయించింది ఆ ఇంటి కోడలు సుధ.

"ఇక మంచం కూడ " అన్నాడు రజనికి మాత్రమే వినపడేటట్టుగ.

"వర్షం లేకుంటే వదిన తలుచుకుంటె" అంది మరీ చిన్నగ తన్నుకొచ్చే నవ్వునాపుకుంటూ.

'అయినా అంత తొందరెందుకు' అనాలనిపించి ఆగిపోయినవ్వుకుంది.

అందరూ టి.వి. ముందు కూర్చున్నారు. చానల్స్ మారుతున్నాయె తప్పా ఎవ్వరూ కదలటం లేదు.కొత్త జంటను ఎవరు పట్టించుకోలేదు.

మధ్యవర్తి మెల్లగ వచ్చి చెప్పిందేమిటి అంటె 'ముహూర్తం బాగలేదని'

బరువైన శ్వాసను వొదులుతు రమేష్ మిద్దె ఎక్కుతు 'పైకిరా' అన్నట్టు సైగ చేసిండు.

'కుదురదు' అన్నట్టు కుదురుగా కూర్చుంది రజిని.

పంచాంగాన్ని పంచాంగ కర్తను తిడుతూ రజని టి.వి. ముందు కూర్చున్నా మనస్సు మాత్రం మిద్దె మీదికి ఎక్కుతూ దిగుతూ వుంది.

"పొద్దంతా మాటిమాటికి రాసుకు పూసుకు తిరిగి ఇప్పుడేమో ఉల్కు పల్కు లేకుండా ఊరుకుంది. కనీసం మాట - ముచ్చటా లేదు. అనుకుంటూ చాప మీద ఒరిగాడు.

అయ్యగారు పందిరి పక్కకు తీసుకెల్లి అరుంధతి నక్షత్రాన్ని చూపిస్తుంటె ఆమె తన మొఖాన్నే చూస్తూ వుంది. అంతేకాదు వెనక్కు మళ్ళీ వస్తూవుంటె 'మీకు అరుంధతి నక్షత్రం కనిపించిందండీ' అని అడిగితె 'ఆ కనిపించింది. అదె నీ మొఖమే' అంటే ఎట్లా నవ్విందో!

'పగలు ఏం నక్షత్రం! ఎంత చూసినా కనబడదే అయ్యగారు ఒకటికి నాలుగుసార్లు మంత్రోచ్చారణతో పలుకుతు వుంటే హిప్నటిజంలోకి వెళ్ళి చూసినట్లు తలలూపుతాం అంతే' అన్నది గుర్తుచేసుకొని. తాను నవ్వుకున్నాడు. 'ఛీ ఈ వర్షం వచ్చి ప్లానంత పాడుచేసే' అనుకుంటు బోర్ల తిరిగి పడుకున్నాడు.

'ఎంతైనా రజని బాగ చిలిపి మనిషి ఆ తలంబ్రాలు పోసేటపుడు దోసిల్లతో ఒక్కటే గుప్పుడు, గుడ్లప్పగించి చూసుడు. పందిట్లో వున్న వాళ్లు ఏమనుకుంటరన్న ధ్యాస గూడ లేకుంటే ఎట్లా. మరీ ఇప్పుడు మిద్దెమీదికొచ్చి గంట అవుతుంది

ఒక్కసారన్న చూడడానికి రాదాయే. ఏమన్న అంటె వర్షముందట ఆ మామగారొకరు, ఆయనకు తగ్గ బిడ్డ. అంత చదువుకొని ఏం లాభం' అనుకుంటు వెలికల తిరిగి చేతులతో గాలి ఊపుకున్నాడు. రమేష్‌కు నిద్ర రాక ఆవలింతలు వచ్చిపోతున్నయి. అంతటి గాలిలో పడుకున్నా ఉక్కపోసినట్టుంది. మాటి మాటికి మంచినీళ్ళు తాగుతున్నాడు. పంచాంగాన్ని పదె పదె తిడుతున్నడు. పక్కన్నె వేపచెట్టు కొమ్మలు కదిలినపుడల్లా ఆమె వచ్చినట్టే తలెత్తిచూస్తూ వున్నడు. ఎదురుచూపులు ఎంత చేదో.

టి.వి. హాల్లో ఫ్యాన్ తిరుగుతున్నా గాలి ఆడడంలేదు. ఉక్కిరి బిక్కిరి అవుతున్న ముఖానికి గాలి తగలెటట్టు కొంగు కొనతో ఊపుకుంటుంది రజని. వెళ్లి బట్టలు మార్చుకున్నప్పుడు అమ్మ పాత చీరె అందించినపుడే అనుకుంది పెద్ద పంతులుగారి పంచాంగ పఠనం జరిగిందని. 'ఏమిటో ఈ ముహూర్తాలు పొద్దున మంచిగుంటది పొద్దూకితె వర్షమా? ఒకే రోజు రెండు రకాలా? అనుకుంటు తల మోకాళ్ల మీద ఆనించుకొని కూర్చుంది. నిట్టూర్పు ఓటి వచ్చిపోయింది.

వదిన జాలి చూపులతో తన గదిలోకి వెళ్లింది. తండ్రి ఆవులిస్తు వసారలోకి వెళ్లి పడుకున్నడు. తల్లి అక్కడె అడ్డం వరిగింది. పక్కలో మనవరాలు సగం కళ్లుతెరిచి పడుకుంది. రజని అటు ఇటు చేసి మరోసారి మిద్దె మెట్ల వైపు చూసి తల్లి పక్కన పడుకుంది. శరీరం, తల్లి పక్కన మనస్సు మిద్దెమీద మధ్యన ముహూర్తం మెట్లు!

పాదం మీద పాదం పెట్టిన స్పర్శ! వెంటనే కాలిని దగ్గరికి గుంజుకొని చేత్తో రాసుకుంటున్నప్పుడు ఉదయం పందిట్లో కాలు తొక్కింది గుర్తొచ్చి నవ్వుకుని పక్కకు తిరిగి పడుకుని కుడిచేయిని నెత్తికింద ఎడమచేయిని తొడమీద పెట్టుకుంది.

కళ్లుమూసినా నిద్ర రావడం లేదు. తాను చదివిన కావ్యాలలోని శృంగారపు వర్ణనలు రంగుల చిత్రాలై రెప్పలకింద కదులుతు వుంటె వల్లంత గాలిలో తేలిపోతున్నట్టనిపిస్తు గుర్తువస్తున్న ప్రతి కావ్య నాయకుడు రమేష్ లాగానె కనిపిస్తు కవిస్తున్నడు. అప్పుడు ఆమె పెదాలు అదో మాదిరిగ కంపించినయి. చక్కని భర్త దొరికినందుకు సంతోషించింది.

ఈలోపు తన చిటకనవేలును పట్టుకొని గుంజినట్లనిపించింది. దిగ్గున తలెత్తి చూసింది. వేలు నిగిడిగా వుంది. పందిట్లో రమేష్ పట్టుకొని తిరిగింది మధ్య మధ్య గట్టిగ నొక్కింది గుర్తొచ్చి సిగ్గుతో మరో పక్కకు తిరిగి పడుకుంది. 'అవును అంతమందిలో కూడ అతను వేలిని నొక్కుతు తిరిగాడు. అమాయకంగా చూస్తూనే తన కసినంతా ఎల్లదీసిండె' అనకుని ముసిముసిగా నవ్వుకుంది. ఆ వేలిని తన పెదాల దగ్గర వుంచుకొని 'ఛు' అని చుట్టూ చూసి ఎవరు వినలేదని నిర్ధారించుకుంది.

పొద్దంత కనిపెట్టుకొని వున్న జీవుడు, రాత్రి కాగానె మబ్బుల్లోకి వెళ్లిన చంద్రునివలె కనుమరుగాయనె అనుకుంటు ముహూర్తాలను మరొకసారి తిట్టిపోసింది.

'మహానుభావుడు మిద్దెమీద హాయిగా పడుకోవచ్చు. ఓసారి వెళ్ళి చూసన్నొస్తే. ఎవరన్న లేస్తె, చూస్తె! వదిన కంట్లో పడితినా తెల్లారే బి.బి.సి.లో ప్రసారం! అందరు ముక్కుమీద వేలేసుకుంటరు, బరితెగించింది' అంటరు.

"అమ్మా అమ్మా ఆయన దగ్గర మంచినీళ్ల చెంబు పెడితివా' అంటూ తల్లిని తట్టిలేపింది. పెళ్లి పనుల అలసటలో ఆమె ఆదమరిచి నిద్రపోతూవుంది. చేత్తో కదిపినా కదలలేదు.

'పోతె వదినను అడిగితె, వదిన గూడ ఇట్లాగె మొద్దు నిద్రలో వుంటె'

"వదినా వదినా" అని పిలిచింది. వదినా పలకలేదు మరొకసారి పిలిచింది. అంత నిద్రలో వుందా. లేక పలకకుండ అన్నయ్య నోరు మూసాడో అని నవ్వుకొని "వదినా ఆయనకు నీళ్ల చెంబు పెట్టారా?" అడిగి ఓ కన్ను మూసి తెరిచింది. అప్పుడు పన్ను కింద పెదవి నలిగింది. "పెట్టాను" అంది ఈసారి వదిన. నాలిక్కరుచుకుంటూ అయితే వదిన మెలకతోటి వుందన్నమాట. లేకపోతె ఇంత తొందరగా జవాబు ఎందుకిస్తుంది అనుకుంటున్నపుడె అతను మెట్లు దిగుతున్న సవ్వడి. అది గ్రహించిన రజని కళ్లుమూసుకొని ఎడమ చేతిలో కుడిచేతిని బోర్లావుంచి గాడ నిద్రలోవున్నట్టు ఉచ్ఛ్వాస నిశ్వాసలు. అతను కాళ్ల దగ్గరికి వచ్చి బొటిమన వేలును వేరు చేసి మెట్టెల వేలును గుంజినట్టనిపిస్తె, లెమ్మని సైగ అనుకుని లేచి కూర్చుంది. మిద్దెమీదికి పోతె, బాగుండనిపించిందా క్షణం ఆమెకు. కాని ముహూర్తం గుర్తొచ్చి కదలకుండా వంటినంతా బిగపట్టి నత్తలాగ ముడుచుకుపోయి తన పాదాలవైపు చూసుకుంది. అక్కడ ఎవరులేరు. ఉదయం అవే వేళ్లకు మట్టెలు తొడిగెటపుడు తన మిగత వేళ్లను అరికాలు కింద అడించింది, ఎవరికి తెలుసు. అలాంటివి జరక్కుండ కావలిగ వున్న వదిన నవ్వుతు నా ముఖం ఆయన ముఖం చూస్తూ పోటోలకు పోజులిస్తుందె తప్ప, మరే విషయం పట్టించుకోలేదు. తాళికట్టెటపుడు జడను ఎత్తిపట్టిందేకాని వీణను మీటె ఆయన వేళ్లవైపు చూడనేలేదు. వదిన మహా మంచి కాపలాదారు. అట్లా ఆరోజు జరిగిందంతా గుర్తుకొస్తు నిద్రకు దూరంచేసాయి. నిట్టూర్పుల పాలు జేసాయి.

ఊళ్లల్లో కోడి కూసిందంటె తెల్లారిందన్న మాట. ఆ తరువాత చేదబావుల గిలకల చప్పుడు. మరికొన్ని చోట్ల బోరు పంపును కొడుతున్న శబ్దాలు. అత్తకోడండ్లు లేచి అత్త వంటింటివైపు కోడలు వాకిలివైపు నడిచారు. కల్లాపు చల్లడం ముగ్గులు

వేయడం జరిగిపోగ అది ఇది అనెలోపె అందరి స్నానాలు అయ్యాయి. రజని తలవెంట్రుకలను నూలు కండువాతో మెలేసి చుట్టుకుని అద్దం ముందు నిలుచోని తిలకం దిద్దుకుంటు వరండాలో ఈజీ చేర్‌లో కూర్చొన్న తండ్రినుద్దేశించి "నాన్న ఏం పుస్తకమది" కుతూహలంగా అడిగింది.

ఆయన మౌనంగా పుస్తకంలోకి చూస్తువున్నడే తప్పా మాట్లాడలేదు. ఆయన కట్టుబొట్టు చూసి ఎవరైన తెలుసుకోవచ్చు నిష్ఠాగరిష్టుడైన చాందసుడని. ఆయన పుట్టి పెరిగిన వాతావరణం ఆయన్ను అట్లా తీర్చి దిద్దింది.

"అది పంచాంగమనుకుంటా" అంది తిలకం సీసాకు మూత బిగిస్తు.

ఈ లోపల రమేష్ మెట్లు దిగొస్తున్నది అద్దంలో కనిపించింది. రెప్పకొట్టకుండ అద్దంలోకి చూసింది. కళ్లు ఎర్రగ నిద్రలేని తనాన్ని చెపుతున్నయి. నీరసంగా అడుగులేస్తు వస్తున్నడు. 'పాపం' అనుకొని నవ్వుకుంది. అవును మధ్యన వొచ్చి నన్ను లేపితే వెలుతుంటి అనుకుంది. ఈ లోపు చిన్నది ఎదురొచ్చి "మామయ్యా స్నానం చేదువు గానిరా" అంటూ బావి వైపు లాక్కుపోయింది. ఆవులిస్తు ఆయన అద్దంవైపు చూసినపుడు తనను మింగేటందుకు నోరు తెరిచిందా అనుకుంది.

'ఈ ఇంట్లో స్నానాల గది లేదా' అన్నట్టు చుట్టు చూశాడు. ఉంది అది ఆడవాళ్లకు మాత్రమే వున్నట్టుంది. అనుకున్నప్పుడు.

"అన్నయ్యా బావి దగ్గర గంగాళంలో నీళ్లు తోడివుంచిన" అంటూ నీళ్ల బిందెతో వంటింట్లోకి నడిచింది సుధ.

00

దేవుని గదిలో పూజ ముగించినంక ఇద్దరికి అల్పాహారాన్ని పళ్లాల్లో తెచ్చిపెట్టింది వదిన. వాటిని చూడగానే శృంగార సాహిత్యం గుర్తుకొచ్చింది. గారె మధ్య రంధ్రంలో చూపుడు వేలుంచి అటు ఇటు తిప్పుతూ భర్త ప్లేటులో వుంచి కింది పెదవిని పై పళ్లతో అదిమిపట్టి చూసింది. అప్పుడు రమేష్ ప్లేట్‌లో వున్న గర్జనొకదానిని చేతిలోకి తీసుకొని అటు ఇటు తిప్పి చూపిస్తున్నపుడు తనలో కదిలిన భావాన్ని అతని మనసులోకి చొచ్చుకొని పోయేటట్లు చూపిస్తు, చూస్తు సుతారంగ ఆతని నోట్లో వుంచుతు అతను గర్జను ఆమె వేలును రెండింటిని పెదవులతో అదిమిపట్టినపుడు "ఓహ్" అంటూ మూలిగి ముందుకు వంగింది. అప్పుడామె ఎదమీది పైట జారిపడింది. చేతికున్న గాజులు సందడి చేశాయి.

అప్పటివరకు ఎక్కడో ఆడుకుంటున్న అన్న కూతురు "నాకు" అంటూ రాగానే వళ్ళోకి తీసుకొని ఎదకు అదుముకుంది. అది చూసిన రమేష్ మనస్సుఎక్కడికో పరుగెత్తగ అదే భావాన్ని కళ్లు ప్రదర్శించినయి. రజని జడలోని మల్లె మొగ్గలు

పూలుగ మారిపోయి ఓ వైపు మల్లెలవాసన, ఆమె మెడకింద అద్దుకున్న మంచిగంధపు వాసన రెండూ కలిసి తనువులను తడుతు కనురెప్పలు సగం మూసిన తలుపులై కదలకుండా నిలేసినయి.

మధ్యాహ్న ప్రయాణానికి మంచి ముహూర్తం అన్నాడు పెదపంతులు. అమ్మ దాన్ని ఆమోదించింది. వదిన సామానులు సర్ధింది. ఆమె పెదవులపై నవ్వుల పొడ మెరుస్తూవుంటే 'ఇంతే సంగతులు' అన్నట్టు రజిని వైపు చూసింది.

"ఏటు" అంది నవ్వుతూ

"ఊటి" అన్నాడు రమేష్

"చల్లబడడానికా" అంది రజని మెల్లగా అతనికి మాత్రమే వినబడేటట్టు.

రమేష్ గతుక్కుమన్నాడు.

"అన్నయ్య స్టేషన్‌కు వెళ్లాడు. టికెట్స్ తీసుకరావొచ్చు" అన్నాడు పెదపంతులు.

"ఎక్కడికి నాన్న" అంది రజని తట్టుకోలేని ఉత్కంఠతతో ఎందుకంటె ఆయన నిర్ణయాన్ని ఎవ్వరు మార్చలేరు కనుక.

"ఇంకెక్కడికి ఏడుకొండలకు. మొదట దేవుని దర్శనమయ్యాకె మిగతావి" అంటు బయటికి నడిచాడు.

'అయితేహానిమూన్ కాదన్నమాట' అని తట్టగానె రమేష్ తలదిమ్మెక్కింది.

రజనికి నోటమాటరాలేదు.

'ముందుగా ఈ ఇల్లు వొదిలిపోవాలి. మనకు ఏకాంతం కావాలి.

'ఏకాంతంలో తన కాంతతో' అనే పాట గుర్తొచ్చింది రమేష్‌కు.

పెద్దోడు రెండు టికెట్స్ తెచ్చాడు. బెర్త్ దొరకలేదట. జనరల్ బోగిలో ప్రయాణం సాయంత్రం ఆరు గంటలకు ట్రెన్.

00

ట్రెన్‌లో కిక్కిరిసిన జనం. ఎక్కువమంది చంటిపిల్లల తల్లులె. తల్లుల చనుబాలు పిల్లల చీముదు, సొల్లు కలిసిన ఓ కొత్త వాసన. అటు కూర్చోలేని ఇటు నిలబడలేని యాతన. ఆడమగ తేడా అంతగా లేని వాతావరణం. ఎక్కడ జానెడు జాగ దొరికినా అక్కడ కూర్చోవడం ఆ బోగిలో మామూలు. కాలుతీసి కాలు పెట్టకుండ కింద టాయిలెట్స్ దగ్గర కూడ బేవర్స్‌వాళ్లు కూర్చొని వున్నారు. ఇద్దరు ఒక చోట నిలుచుండె అవకాశం మధ్యరాతిరికి కాని దొరకలేదు. అప్పుడు ఎక్కడోళ్ళు అక్కడ జోగుతున్నారు. అప్పుడు మధ్యన వున్న కొందరిని దాటుకుంటు రమేష్‌ను చేరి పక్కన నిలుచుంది. రైలు డబ్బాలు ఒకదానికొకటి తాకుతు వేరై మళ్లీ దగ్గరయి పరుగెత్తుతున్నట్టు ఇద్దరు కదులుతు నిలుచున్నారు. అంతకుముందు ఆమె ఎవరిపక్కన్నో నిలుచుంటే రమేష్‌కు యమ చిరాకువేసింది. అట్లా ఆ రాత్రి

గడిపారు. మరునాడు ఉదయం రైలు తిరుపతి స్టేషన్‌లో ఆగింది. పైకి బస్సులో ప్రయాణం. అది త్రీసీటర్ కదిలినా మెదిలినా పక్కనున్నవాళ్ల పరేషాన్. "కొత్త దంపతులా" అని అడిగింది పక్కనున్నావిడ. 'అవును' అన్నట్టు తలాడించాడు రమేష్. ఆ తరువాత 'ఆమెకెట్ల తెలిసిందో' అన్నట్టు కనుబొమ్మలను కదిలించిందు.

అప్పుడు రమేష్ భుజం మీద రజని తల ఆనించి వుంది. ఉఛ్వాస నిశ్వాసలు ఆతని మెడ మీద ఓ మోస్తరు వేడిని పిచికారి చేస్తు వున్నయి. ఎగుడు దిగుడులో బస్సు కుదుపులు చెప్పరానివి. కొత్త శరీరాల స్పర్శలు అట్లా వుంటాయి మరి గిజర్‌ను ఆన్ చేసినట్టు.

బస్సు గుట్టమీద ఆగింది. సాధువులు సన్యాసులు గుంపులుగా కూడి సిలుం పీలుస్తువున్నరు. దంపతులు బస్సు దిగి ఎంక్వయిరిలో ఓ గది గూర్చి అడిగారు. గది దొరకలేదు. కాటేజీలు ఖాళీలేవన్నారు. అదీ దొరకలేదు. సామానులు ఓ చోట పెట్టి ఒకరు ఉండి మరొకరు స్నానం చేసుకొని వచ్చారు. బాత్‌రూంలో గోడలకు గీసిన బూతు గీతలను చూడగానే రజనికి చిలిపి ఆలోచనలు వచ్చాయి. సబ్బు రాసుకుంటున్నప్పుడు ఏదో హాయిలో తేలిపోతూ నవ్వుకుంది. దర్శనానికి వచ్చిన వాళ్లంతా వరుసగా అక్కడ స్నానిస్తుంటారు. ముహూర్తం సరిగలేక నాన్నగారు దేవుని దగ్గర నిద్రచేసి రమ్మని పంపినందుకు కోపమొచ్చింది. కాని ఏం చేస్తుంది. 'ఆచారం అంటారెకాని అది గాచారంగ మారేది తెలుసుకోరు' అనుకుంది. "దర్శనం కోసం గుళ్లోకెళదామా" అన్నాడు రమేష్ వళ్ళు తూడ్చుకుంటు టర్కి టవలంత పసుపు పసుపుగ మారింది. అప్పుడు అదో మాదిరిగ చూసింది రజని. తలవెంట్రుకలను కాటన్ కండువాలో మలిచి నలిపింది అప్పుడే తలస్నానం చేసిన స్త్రీ వర్షంలో తడిసిన పూవులాగుంటుంది.

"ఏమండి వంటి పసుపు ఇంకా పోలేదు" అంది నవ్వుతూనే

"రుద్దేవాళ్ళుంటే కదా" అన్నాడు నిష్టూరంగా

"రమ్మంటే వచ్చేదాన్నిగ" నిగూడపు చూపులతో

"ఇవి పబ్లిక్ బాత్‌రూమ్స్ దమయంతి గారు" అన్నాడు.

'ఆమె ఎవరు' పిడికిలి బిగించి బొటిమన వేలును పైకుంచి కదిలిస్తు చుట్టు చూసింది.

"వళ్లు మీది చేతులు నావి మధ్యన ఎవ్వరికేం పని" అంది చిరుకోపాన్ని నటిస్తు.

"మొత్తానికి ఓ పని అయిపోయింది" అన్నాడు రమేష్.

"అయిపోతే బాగానెవుండు" అంటూ దెప్పిపొడుపుగా నేలవైపు చూసింది.

అప్పుడు వెలిగింది రమేష్‌కు. మెల్లగనవ్వి బట్టలు మార్చుకునె గదిలోకి నడిచాడు.

"మామకు తగ్గ అల్లునివి" అంది మూతిని అటు ఇటు తిప్పుతూ

"అంటె" తిరిగొస్తు.

"తిరుపతికి వద్దు వేరె ఎటన్న వెళ్లొస్తాం అనొచ్చుగ"అంది.

"ఇక్కడ ఏంచేద్దాం" అంది మళ్లి తానె జుత్తు చివర ముడేసి వొదులుతూ

"గుండు కొట్టించుకుందాం" తలమీద చేతిని తిప్పుతూ

"గుండంలో మునగొద్దు" అంది బుంగమూతిపెడుతూ

రమేష్ మాట్లాడలేదు.

"పదండి మహాశయ. గుడిలోకి పోదాం" అంటు సామాను అందుకొని "వీటిని కాటేజ్ దొరికేవరకు క్లాకు రూమ్‌లో వుంచుదాం" అంటూ క్లాకు రూంవైపు నడిచారు.

సామాను అక్కడుంచి రిసిప్ట్ తీసుకొని, గర్భ గుడి ముఖద్వారం దాటి ధ్వజస్థంభం దగ్గరికి చేరారు. అక్కడి నుండి క్యూ గుండ గర్భగుడిలోకి నడవాలి.

"పద అన్నాడు" రమేష్.

'ఎక్కడికి' అన్నట్టు చూసింది.

'అటు' అన్నట్టు తలాడిస్తూ గర్భగుడి ద్వారాన్ని చూపించాడు.

'కాదు ఇటు' అని పక్కన్నెవున్న ఓ స్థంబాన్ని చూపిస్తు తాను ముందె దానిని సమీపించి నిల్చుంది. ఆమె వెనకాలె రమేష్ వెళ్లి నిలుచున్నాడు.

" 'అటు చూడండి' అంటు కళ్లతోనె సైగ చేసింది".

బూతు బొమ్మల గురించి గైడ్‌లాగ చెపుతువుంది రమేష్‌కు. "చూడండి ఆ భంగిమ" ఆ ఆడమగ ఎంత తన్మయత్వంతో స్థిరంగా వున్నారో" అంది చూపు అక్కడ నిలిపి.

"గుళ్ళో ఈ బూతు బొమ్మలేమిటి?" అంటు గుడ్లప్పగించి చూస్తా వుండిపోయాడు.

"ఆ విషయాన్ని పూజారిని అడిగితే చెప్పుతాడు. ఆయన ఏకంగా ఓ పుస్తకమె రాసేసిండు" అంది నవ్వుతూ. అట్లనా అన్నట్టు చూశాడు అతను.

"ఇది ఇక్కడికొచ్చె మనలాంటి వాళ్లకు ఓ మోడలన్నమాట" అన్నాడు కొంచెం కొంచెం నవ్వుతు.

'అవును' అన్నట్టు తలాడించి "పాతవాళ్లకో జ్ఞాపకం కూడ" అంది ఓసారి, కళ్ళు మూసి తెరుస్తు. అప్పుడు ఆమె ముఖంలోకి చూస్తు, ఈమె సాఫ్ట్‌వేర్‌లోని శృంగార దృశ్యాలను చూసి వుండదు' అనుకుంటు గత రాత్రి గుర్తొచ్చి.

"నీవు బాగ చదివావు అన్నమాటెకాని సమయస్ఫూర్తి లేదు" అని గునిగాడు.

రాత్రి అక్కసును వెళ్లగక్కుతున్నది గ్రహించిన రజని.

"ఏంచేయమంటవు స్వామి మా యింట్లో అన్నీ ఆచారాలే" అంటు కన్నుగీటుతూ 'అతని గదమకింద చేయివుంచి' తనమూతిని దగ్గరచేసుకుంటూ బతిలాడింది. దగ్గరైనమూతిని చూసి ముద్దుకోసం అనుకున్నాడు.

"మనిషి ఆనందానికి అడ్డొచ్చే ఆచారాలేమి ఆచారాలు" అంటు ఆమె మీదినుండి

చూపులను ఆ బొమ్మమీదికి మార్చి ఆ బొమ్మల భంగిమనే చూస్తున్నాడు. అవును బూతు అంటేనే అందరు బూతద్దంలో చూస్తుంటారు. ఇక కొత్తవాళ్లు మరీను.

"బలే బాగుందిలే మోడల్" అంటు పడిపడినవ్వింది. రమేష్‌లో తెలియని రోషం బుసకొడుతువుంది.

"మహానుభావ కాస్త ఓపికపట్టు మోడలేమి కర్మ" అంటు కదిలలే ఎదను చేతులతో అదిమి పట్టుకుంది. అప్పుడు ఆమె దరించిన నగలు ఓ కొత్త అందాన్ని తెచ్చిపెట్టాయి.

"గుడిలోకి వెల్దామా" అన్నాడు మెడమీద చేయి వుంచుతూ, అక్కడ వెచ్చగ తగలగా, బొటిమన వేలుతో అదిమి వొదిలాడు.

"ఆలస్యం చేస్తె కాటేజి దొరకదు పద" అంటు చుట్టుచూసి ఎవరు చూడలేదని అనుకున్నాడు. కాటేజి దొరికింది. కాటేజిలో ఏకాంతం దొరికింది. ఏకాంతంలో తనకాంతను తనివితీర చూసుకుంటున్నప్పుడు, వచ్చేటప్పుడు వదిన యిచ్చిన చీటిని మెల్లగా అతని చేతిలో వుంచింది. దానిని చూసిన రమేష్ మొద్దు బారిపోయాడు. రజని అంతకు ముందే చదివింది కనుక నవ్వుతూ మంచం మీద వొర్గి బోర్ల తిరిగి మెత్తలో తలదూర్చింది. ఆ భంగిమను చూసిన రమేష్‌కు ఎదమీది ఎత్తులు అనిగిపోవా అన్న అనుమానం వచ్చింది.

'మూడు నెలల వరకు మహూర్తాలు బాగలేవు'

ఆ రాత్రంతా సుతారంగా కొట్టుకున్నారు. తీయగా తిట్టుకున్నారు. వేరు, వేరుగా పడుకున్నారు. పొద్దు బారెడెక్కినా రమేష్ లేవలేదు. రజని తలంటు స్నానంచేసి నిద్రిస్తున్న భర్తను ముద్దు పెట్టుకుంది. అది తడిలేని ముద్దు అయినా అది చేసిన అల్లరికి రమేష్ ఆవలిస్తూ లేస్తు ఆమెను అందుకోచూశాడు. ఆమె అందకుండా తప్పిచ్చుకుపోయి కాటేజిముందు ముగ్గేస్తువుంది.

'అవి నాలుగు పాదాలు

అటు ఇటు మెట్టెలున్న పాదాలవేళ్ళు పైకిచూస్తున్నాయి.

మద్యలో రెండు పాదాల వేళ్ళు కిందికి చూస్తున్నాయి.

సూర్యకిరణాలను చూడడాని కొచ్చిన రమేష్ దృష్టి ఆ ముగ్గుమీద

నిలిచిపోయింది. ఆతరువాత తట్టుకొలేక లోనికి నడుస్తూ శృంగార చూపును అభినందించాడు. రమేష్ బట్టలేసుకుని తల దువ్వుకుంటువున్నప్పుడు.

"త్వరగా కానివ్వండి అట్లా హోటల్‌కెల్లి టిఫిన్‌చేసి, అట్లా అట్లా తిరిగొద్దాం" అంది అప్పటి వరకు పైకి చెక్కిన కుచ్చిళ్ళు వదిలి సరిచేసుకుంటూ.

"కొంచమొచ్చి షర్ట్‌కు గుండీలు పెడతావా" అన్నాడు అద్దంలో చూసుకుంటు వెంట్రుకలను నొక్కుకుంటు.

"అబ్బా ఎంతాశ అట్లనే" అంటు కొంగును మడత చేసి బుజంమీద పర్చుకొని వెనుకనుండి గుంజి సరిచేసుకుంది.

"నీ ఇష్టం నేను ఇట్లానే నడుస్తాను మరి" అన్నాడు దువ్వెనను టేబిల్‌మీద వేస్తు

"వస్తున్న స్వామి"అంటు వచ్చి గుండీలను పెడుతువుంది.

ఆమె ఎదవైపు చూస్తు"నాకంటే ఈ కొంగు నయం" అంటు దానిని తాకడానికి చేయిని చాచిండు. " వద్దబ్బానేను తట్టుకోలేను వర్షం ఎల్లిపోని, ఆ తరువాత అంతానీదే"అని తప్పుకుంది.

"అయ్యగారూ ఆటో వచ్చింది" అన్నాడు వాచ్‌మెన్.

జరగబోయె చర్య దానంతట అదే ఆగిపోయింది.

ఇద్దరు బుద్దిగ బయటికొచ్చి, తాళంవేసి ఆటో ఎక్కారు. ఆటో కదిలింది.

'కొంచం దూరంగా కూర్చోకూడదు' అన్నట్టు చూసింది.

'అదేం కుదురదు' అన్నట్టు చూశాడు. భుజానికి భుజం తగిలిస్తు

మరి దగ్గర్కి జరిగి కూర్చున్నాడు. ఆటో అద్దంలో ఆటోవాడు చూసేది గమనించి కొంచం జరిగి సర్దుకుని కూర్చుంది. ఆటో పరుగెడుతువుంది.

"నిన్న మొన్ననే పెళ్ళయినట్టుంది కదండి" అన్నాడు నడీడు ఆటోడు.

అంతా తిరిగి చూసినాకా స్టేషన్‌కెళ్ళి సాయంత్రం ట్రేయిన్‌కు తిరుగు ప్రయాణపు టికెట్స్ రిజర్వు చేయించుకున్నారు కాని బెర్త్ దొరకలేదు. స్టేషన్ నుండి తిరుగొచ్చి కాటేజ్‌లో అడుగు పెట్టేటప్పుడు గుడిలోని బొమ్మలు గుర్తొచ్చి రమేష్‌కు స్నానాల గదిలోకి వెడుతున్న రజని చూస్తూ అట్లాగే చూస్తూ ఉండిపోయాడు. చందనపు పౌడర్‌తో జలకమాడి టర్కి టవల్‌ను మెడమీది నుండి రెండు పాయలుగ పిక్కలవరకు వేలాడుతుంటే , ఎర్రటి కార్పెట్ మీద తడిపాదాల ముద్దెరలను అద్దుతు నడిచి డ్రెస్సింగ్ టేబుల్‌ముందాగింది. ఆమె వెనకాల రమేష్ అద్దంలో ఇద్దరు ఒకటిగ కనిపించే దృశ్యం. అంతే ఆరోజు తెల్లవారిపోయింది. ప్రయాణం వాయిదాపడింది.

00

పెండ్లి అయిన పదినెలలకే రామన్న పంతులు ఇంట్లో బాలసారె గణంగా జరుగుతుంది. 'అల్లుని రూపు కూతురు రంగు' అని మురిసిపోతువుంది జానకమ్మ.

రామన్న పంతులు పంచాంగాన్ని విప్పేది చూసి "తిథులు నక్షత్రాలు పక్కన పెట్టి పిల్లవాన్ని తొట్టెల్లో వేయాలిరండి" అని పిలిచింది. పంతులు పంచాంగాన్ని పక్కన పెట్టి తొట్టెలవైపు నడుస్తుంటే, రజని రమేష్ చిన్నగా నవ్వుకుంటు నిలుచున్నారు. ఆ యింటి కోడలుకు మామ ఇచ్చిన చీటి గుర్తురాగా ఆమె తన నవ్వును కలిపింది.

రామన్న పంతులు మాత్రం కుడిచేతి వేళ్ళను లెక్కపెడుతూ ఎడమచేతిలో తెరిచివున్న పంచాంగం పేజీలు గాలిలో రెపరెపలాడుతుండగా, దీర్ఘంగా ఆలోచిస్తున్నాడు.

• 2002

స్వాతి